# మరమరాలూ - బఠాణీలూ - అందులో సామ్యవాదం

"**శి**వశంకరం... శివశంకరం"

వెనక నుండి, దూరంగా ఎవరో పిల్చినట్లుంటే వెనక్కి తిరిగి చూశాడు శివశంకరం. వెంటనే పోల్చేశాడతను - శమంతకమణి. అప్పుడు సన్నగా, రివటలా వున్న పిల్ల యిప్పుడు ఎముకకు కండపట్టి చిక్కగా కన్పిస్తోంది.

మార్కెట్టు రోడ్డుకు యీ చివరనున్న శివశంకరం, ట్రాఫిక్ తప్పుకొని ఆమె వైపు వెళ్ళేటప్పటికి నారాయణరావు జామపండ్లవాడి ప్రాణంతీసి సంచిలో వేయించు కుంటున్నాడు. అతను వాళ్ళను చూసి దగ్గరదగ్గర పదేళ్ళయింది. నారాయణరావూ చాల మారిపోయాడు.

"మన శివశంకరమండీ... గుర్తుపట్టలేదూ...." శమంతకమణి చెప్తోంటే శంకరానికి నవ్వొచ్చింది, 'తన్నే గుర్తుచెయ్యాలా, తమదెన్నాళ్ల పరిచయం అని.'

"ఏ శివశంకరం....?" నారాయణరావు.

"అదేమిటి?... మీ మతిమరుపు... బెజవాడ గాంధీనగరంలో మన పక్కనుండే వాళ్ళు కదండీ... అతన్ది మా పుట్టింటివాళ్ల ఊరుకూడాను..."

"ఓః.... అయామ్ సారీ... నువ్వటోయి... అలా చిక్కిపోయావేం.... మీ ఆఫీసువాళ్లు జీతాలివ్వటం లేదా ఏం?" అని పగలబడి నవ్వాడు.

శంకరానికి తెలుసు. తనంతచిక్కిపోయాడాని బాధపడే, ప్రేమా, ఆత్మీయతాకాదు. ఒట్టి ఫార్మాలిటీనూ కాదు. 'మీ ఆఫీసువాళ్ళు యిచ్చే జీతం తక్కువ, యింకా అట్లాగే గుమస్తాగాపడేడుస్తున్నావా యేం?' అన్న భావన. అలా వ్యంగ్యంగా మాట్లాడటమే అలవాటతనికి. ఇంత చిన్న విషయాన్ని పట్టుకుని సాగదీయం శంకరానికి యిష్టముండదు. పైగా ఎప్పుడయినా ఆ మాటల అర్థాలు విడదీసి మాట్లాడాల్సివస్తే, వ్యంగ్యంగా మాట్లాడే అతనికి సిగ్గులేకపోయినా శంకరానికి సిగ్గువేస్తుంది. అందుకని వాటిని తేలిగ్గాతీసుకుని, గుర్తించనట్టుండటం అతనికి పరిపాటి.

సమాధానంగా నవ్వేశాడు శంకరం.

''యీ వూరు బదిలీ అయింది కాబోలు...'' అన్నాడు శంకరం.

''అవును శంకరం... మొన్న జనవరి ఫస్టుకే వచ్చాం.... నువ్వీవూళ్ళో వున్నట్టే తెలీదు... ఓ కార్డుముక్క వ్రాసిపడేస్తే మంచి ఇల్లయినా చూసి పెట్టుండేవాడివి... కూరలు కొంటానికి వచ్చావా ఏం?... నిలిపేశాం'' అన్నది శమంతకమణి.

''ఫరవాలేదు.''

''ఏడీ మీ వెంకటస్వామి రాలేదేమండీ? వాడిమాటలు నమ్మొచ్చుటండీ... నేను మొత్తుకుంటూనే వున్నాను.''

''వుండవే వస్తాడు.... యిప్పుడేగా ఆరున్నరయింది. ఆఫీసునుండి నడచిరావాలా...., పదవోయ్ శంకరం కాఫీ త్రాగివద్దాం...'' అని దారి తీశాడు నారాయణరావు.

''ఎవరతను?'' అన్నాడు ప్రక్కగా నడుస్తూ శంకరం.

''మా ఆఫీసు ప్యూను... ఓ ఫ్రండ్ యింట్లో యివాళ పార్టీవుంది. 'అమ్మకు శనివారం. పండ్లూ అవీతీసుకుని, మిగతా షాపింగ్ చేసుకుని ఆరున్నరకల్లా మోండా దగ్గరకు వస్తాముర... నువ్వీ సామాను తీసుకెళ్ళి యింట్లో పడెయ్యి.... మళ్ళీ మేం వచ్చేటప్పటికి ఏ పదవుతుందో... ముసలమ్మ అప్పటిదాక ఏం వుంటుంది' అని చెప్పి బయలుదేరాను. నేను ఆఫీసునుండి యింటికెళ్ళొచ్చి, సామాన్లవీ కొనటం పూర్తయినా కూడా వెధవ అయిపులేడు.''

సమయం ఆరు ఆరున్నరయింది... చీకటి రేకలు ముసురుకుంటున్నాయి. నగరం రంగు రంగుల దీపాలతో బోగందానిలా వెలిగిపోతోంది. పుష్యమాసపు చల్లగాలి, ఆమెమీది పయ్యెటలా, శరీరాలను జివ్వుమనిపిస్తూ మెల్లగా వీస్తోంది.

తాజ్‌లో కాఫీ త్రాగుతున్నారు.

''మీ యిల్లెక్కడ శంకరం...''శమంతకమణి అంది.

''అమీర్‌పేట...''

''దోవలోనే... ఎప్పుడో రావాలి...''

''యిప్పుడే డిపార్టుమెంటులో పజ్జేస్తున్నావోయ్.''

చెప్పాడు.

''ఎవరు మీ సూపరింటెండెంటు.''

''రామచంద్ర అనీ...''

''ఓ ఎర్రగా, పొడుగ్గావుంటాడు... నేను జబల్‌పూర్‌లో వుండగా అతనక్కడ పి.యస్.గా వుండేవాడు. చాలా మంచివాడోయ్. నీకేమన్నా పని కావాలంటే క్షణాల్లో అయిపోతుంది.. చెప్పు...''

''నాకేం పన్లుంటాయి...'' నసిగాడు శంకరం.

మళ్ళీ మార్కెట్‌వేపు నడిచారు. వీధులన్నీ రద్దీగా వున్నాయి. జనం డబ్బులేదంటూనే వుంటారు. ఎక్కడనుండి వస్తుందో కొనటానికి యీ నెలాఖరు రోజుల్లోకూడా. వెంకటస్వామి వచ్చిన జాడేంలేదు.

''ఓ పని చెయ్యరాదుటోయ్ శంకరం... నువ్వెళ్లేదటేగా... యీ సామాను యింట్లో పడేసివెళ్ళు... ప్రకాశ్‌నగర్ కాలనీలో దిగావంటే... యిదుగో అడ్రసు. అమ్మను గుర్తుపట్టగలవుగా....''

''అదేమిటండీ... అతనిచేత...''

''నువ్వుండవే... మన శంకరమేగా.... అతనేమనుకుంటాడు.... నాకా మాత్రం తెలీదూ...''

పదేళ్ళ తరువాత కనపడిన పరిచయస్తులు సహాయం అడిగితే చేయకుండా ఎవరైనా ఎలా ఉంటారు. అందులో శంకరం మరీ మొహమాటస్థుడు.

వాళ్ళ సంచులు భుజాన వేసుకుని బయలుదేరాడు శంకరం మోండానుండి.

ఇక్కడ నారాయణరావు, శమంతకమణుల గురించి కొంత చెప్పాలి. శంకరం బెజవాడ సిమెంటు ఫ్యాక్టరీలో టెంపరరీగా పనిచేసే రోజుల్లో శమంతకమణి ద్వారానే నారాయణరావుతో పరిచయమైంది. శమంతకమణీ, శంకరం ఒకే పల్లెలో పుట్టిపెరిగినవాళ్ళు. పెళ్ళైన తరువాత శమంతకమణి, భర్తతో కాపురం చెయ్యటానికి బెజవాడ వచ్చింది. కడుపు చేతపట్టుకొని ఊళ్ళమీదపడ్డ శంకరం బెజవాడ సిమెంటు ఫ్యాక్టరీలో తేలాడు. శంకరం వాళ్ళది బీద కుటుంబం. తండ్రి లేడు. తనమీద ఆధారపడ్డ చెల్లెల్నీ, తమ్ముణ్ణీ, అమ్మనీ పోషించాల్సిన బాధ్యత అతనిమీద ఉంది. సిమెంటు ఫ్యాక్టరీ ఉద్యోగంలో జేరిన శంకరం గృహాన్వేషణలో ''అద్దెకిచ్చే భాగాలేమన్నా వున్నాయా'' అని అడుగుతూ శమంతకమణి వాళ్ళయిల్లే తట్టడం తటస్థించింది. యింకా చిన్నతనం. బాల్యస్నేహాలు మర్చిపోయేటంతగా ఎదగని శమంతకమణి చాలా ఆప్యాయంగా వ్యవహరించింది. ఆ తరువాత ఆ వీధిలో వాళ్ళకు తెలిసిన మధుసూదనరావు గారింట్లో ఓ పోర్షన్ అద్దెకిప్పించటం, అతను తల్లీ, చెల్లెలూ, తమ్ముళ్ళతో కాపురం పెట్టడంలో చాలా సహాయపడింది.

నారాయణరావు చాలా ప్రాక్టికల్ మనిషిలాగ కన్పించేవాడు. వైయక్తికమైన మానసిక అనుభూతులూ, హృదయ ప్రకంపనలూ సర్వం అతను డబ్బుల తరాజులో తూచి ఎంచుకునేవాడు. అలా అని నారాయణరావు ఒట్టి డబ్బుమనిషి అనుకోనవసరంలేదు. కుర్చీలో కూర్చుని తీరిగ్గా చాలా విషయాలు మాట్లాడేవాడు. జీవితావసరాలే తీరక బీద ప్రజానీకం పడే బాధలకు అతని హృదయం ద్రవించేది. బీదల కడుపుకొట్టి, పొట్టలు పెంచుకునే భూస్వాముల,

పెట్టుబడిదారుల అన్యాయాలకు అతని హృదయం ఆక్రోశించేది. ''ఆర్థిక సమానత్వం లేకపోవటమే సర్వమైన చెడుగులకూ మూలకారణం'' అనేవాడు.

ఆరోజుల్లో శంకరం, నారాయణరావూ యిద్దరూ కలిసి కాస్టింగ్ చదవటానికి మూల ప్రేరణా, ఉత్సాహం అతనివే.

''చూశావోయ్ శంకరం. యిన్ని ఏళ్లపైబడి, యిప్పుడు చదవాల్సిన ఖర్మ ఏమిటి మనకు, అదే డబ్బున్నట్లయితే, హాయిగా బి.కాం పూర్తికాంగానే కలకత్తావెళ్ళి యిన్స్టిట్యూట్‌లోనే చదివేవాళ్ళం కదా. పగలు వుద్యోగం... రాత్రి చదువు. యిక జీవితాలకు సుఖమెక్కడ?... అందుకే నేననేది. ఆర్థిక సమానత్వముండాలి.''

యిలా వుండేది నారాయణరావు దర్శనశాస్త్రం.

అప్పటికింకా శంకరం పెళ్ళికాలేదు. రేణుక, శంకరం వేలువిడిచిన మేనమామ కూతురు. పుట్టానే శంకరం భార్యగా పుట్టింది. అలాగే పెరిగింది.

బాధ్యతల బరువునీడలు యింకా ముసరని ఆనాటి స్వచ్ఛమైన దినాల మధురస్మృతులు శంకరంలో యింకా ఆనంద రవళులు మీటుతూనే వుంటాయి.

కృష్ణాతీరం బ్యారేజిమీద పరుగులూ....

ఆనాడు... ఓ ఆదివారం....

సీతానగరం వెళ్ళారు రేణుకా శంకరాలు. సాయంకాలపు నీడలు పొడుగ్గా పరుచుకుంటున్నప్పుడు, తాడేపల్లి నుండి రైలుపట్టాలమీదుగా నడుస్తూ...

''బావా! అంతదూరం దాకా రైలు పట్టాల మీదే నడచిరావాలి... కాలు క్రింద పెట్టగూడదబ్బాయి... నెగ్గుకు వచ్చావంటే నీవు కావాలన్నది నెరవేరుతుంది.'' అన్నది రేణుక.

''ఏమని కోరుకోను.''

''ఏమని కోరుకుంటావు. ఓ మంచి ఉద్యోగం రావాలని కోరుకో....''

మాట్లాడకుండా ఆరైలు పట్టాలపైన నడవసాగాడు శంకరం. అతి జాగ్రత్తపడ్డాడేమో, తొట్రుపడి క్రిందకు దిగిపోయాడు.

రేణుక పకాపకా నవ్వుతోంది.

''పోన్లే బావా! వెధవ ఉద్యోగం... యింకేదయినా మంచిది కోరుకొని యీసారి జాగ్రత్తగా నడువు.

''సరే'' ఈసారి ప్రయత్నం ఫలించింది.

''అన్నప్రకారం తమకోరిక తీరుస్తాం ఏమిటో సెలవివ్వండి'' అన్నది మహారాణిలా పోజు పెట్టి.

''చెప్పనా.''

''చెప్పు''

''మళ్లీ వెనక్కి తగ్గకూడదు పిల్లా?''

''ఊc చెప్పు. భయపడతాననుకున్నావా...''

''సరే నీయిష్టం... ఓ రంభ కావాలని కోరుకున్నాను...''

''ఎవరో ఆ రంభ...'' అన్నది సన్నగా సిగ్గుపడుతూ రేణుక.

''ఆ పిల్ల సన్నగా, తెల్లగా, పొడుగ్గా వుంటుంది, మేరీస్ స్టెల్లాలో ఫస్టియర్ చదువుతోంది. నన్ను బావా అని పిలుస్తుంది.... కోపం వచ్చినప్పుడు...''

''చెవి మెలిపెడ్తూంటుంది ... ఏం.. అంతేనా''

''ఏయ్‌పిల్లా దూరం... దూరం... యింత బట్టబయలుగానా... ఎవరేనా చూస్తే...''

తిరిగివస్తున్న శంకరం, రేణుకలకు దోవలో నారాయణరావు కన్పించాడు. అందమైన సాయంకాలం విరిగిపోయింది.

''ఏవోఁయ్... రెండురోజుల్నించి కన్పించటంలేదు'' అన్నాడు వస్తూనే అధికార స్వరంతో. క్రొత్త వ్యక్తులముందు తన అధికారం చూపించడంద్వారా తన గొప్పదనమో చనువో, ఏదో ప్రదర్శించాలనుకుంటాడు. స్నేహితుడి ప్రక్కనున్న స్త్రీని సూటిగా చూడ్డానికి సహజంగా జంకుతుంది మానవ ప్రకృతి. కాని అలాంటి జంకు, బెరుకులు చూపించడం అభ్యుదయ లక్షణం కాదంటాడు నారాయణరావు.

''రేణుక... మా మామయ్య కూతురు... బి.యే. చదువుతోంది.'' పరిచయంచేశాడు శంకరం.

నమస్కారాలయినాయి.

''యిలా అయితే లాభం లేదోయ్, రెగ్యులర్‌గా చదవాలి. మెథడ్స్ యింకా టచ్చేచెయ్యలేదు. కమర్షియల్ లా అంతా అట్లాగేవుంది. ఎకౌంట్స్ నువ్వొస్తే కలిసి చెయ్యొచ్చని ఆగాను'' అన్నాడు నారాయణ రావు. శంకరానికి తెలుసు- అంతా అబద్ధమని. అతను తన కోసమేకాదు, ఎవరి కోసమూ ఆగని మనిషి.

పరీక్షలు రెండునెలలే ఉన్నాయని సెలవుపెట్టి, పెళ్ళాన్ని పుట్టింటికి పంపించి ఘోరంగా చదివేస్తున్నాడు నారాయణరావు. అందువల్లే శంకరం ఎప్పుడయినా చదవటానికి రాకపోతే, ఎక్స్‌ప్లనేషను యిచ్చుకుంటూ వుండాలి.

''యివాళ రాత్రికి తప్పకుండా వస్తాగా...'' అన్నాడు శంకరం.

నారాయణరావు వెళ్ళిపోయాడు.

''ఎవరు బావా! యీ శ్రీకృష్ణపరమాత్మ.''

''నారాయణరావని... నా ఫ్రెండ్... యిద్దరం కాస్టింగ్ చదువుతున్నాం.''

''ఏం కాస్టింగో... నిన్ను మాత్రం బాగానే వెలకట్టేసినట్లున్నాడు. ఆయన్ని చూడంగానే అలా 'రాముడు బుద్ధిమంతుడు' అన్నట్లు మారిపోయావేం.''

ఆరోజు రాత్రికి నారాయణరావు యింటికి వెళ్ళాడు శంకరం. శమంతకమణిని యింటికి పంపించిన తరువాత తనొక్కడే అద్దె భరించటమెందుకని వాళ్ళ ఆఫీసులో పనిచేసే యింకో యిద్దరు బ్రహ్మచారుల్ని యింట్లో చేర్చాడు. పాపం వాళ్ళకర్మ... అద్దెలో భాగం యిస్తూకూడా వాళ్ళు సొంతయిల్లులా ప్రవర్తించటానికి వీలులేదు. పెద్దగా మాట్లాడితే 'డిస్టర్బెన్సు' అంటాడు.

''రెండు నెలలు సెలవుపెట్టి 'జీతం నష్టం' మీద నేనెందుకు చదువుతున్నానో మీరు అర్థం చేసుకోవాలి. మనం బ్రతకాలి. యింకోళ్ళని బ్రతకనివ్వాలి. సర్దుకుపోకపోతే ఎలా? మన శంకరం చూడండి ఎలా కష్టపడుతున్నాడో. మిల్లులోవచ్చే ఓవర్ టైము పోయింది. పైగా జీతం నష్టంమీద సెలవుపెట్టాడు. అనవసరంగా సమయం వృధా చెయ్యకపోతే ఏ మ్యాగజైనన్నా చదువుకోరాదుటోయ్ వెంకటశేషయ్యా! సాహిత్యపిపాసయినా పెరుగుతుంది.'' తన హిమాలయమంత ఉచ్చమైన కార్యం ముందు, మిగతావన్నీ తుచ్ఛంగా, సర్దుకుపోవాల్సినవిగా కనిపించేవి నారాయణ రావుకు. వాళ్ళు సినిమాలగురించికాని, ఆఫీసు విషయాలుగాని మరేదైనా పిచ్చాపాటీ మాట్లాడకుండా గప్‌చుప్‌గా పడుకుంటే వాళ్ళంత సహనజీవులు ఇలలో మరిలేరని ప్రశంసించేవాడు నారాయణరావు.

''చూడవోయ్ శంకరం... యీ టాపిక్ ఫలానా ఫారిన్ ఎడిషన్‌లో బాగా డీల్ చేశాడోయ్. నువ్వు యిదికాపీ ఎత్తావంటే ఇద్దరం కలిసి చదువుకోవచ్చు. ఏమంటావు?'' అనేవాడు. అలా అతను మాట్లాడే మాటల్లో 'నీకేలాభం' అన్న ప్రలోభం వుండేది.

శంకరం కథలు అప్పుడప్పుడూ ప్రచురితమవటం చూసిన నారాయణరావుకు వెక్కిరింతగా వుండేది. ''నువ్వా వ్రాసేవాడివే...'' అని హేళనగా మాట్లాడేవాడు. వెదుకుతూండేవాడికి ఏదో ఓ లోపం కన్పిస్తూనే వుంటుంది. ఆ వారపు వారపత్రికలో శంకరం కథ ప్రచురితమవటంతో మొదలైంది ఆనాటి సంభాషణ.

''ఇదేం కథోయ్ శంకరం! దీంట్లో స్త్రీపాత్రనంత పేలవంగా సృష్టించావు. ప్రకృతిలోని కోమలమయిన వస్తువునే పరిత్యజించావు. రచనకూ, స్త్రీకి చాలదగ్గర సంబంధముంది. రెండూ మృదువుగా స్పృశించదగిన వస్తువులు. స్త్రీపాత్రలోని కుతూహలం పరిత్యజించటంతో సగం ప్రపంచాన్ని నువ్వు ఉపేక్షించావన్నమాటే.''

రేణుక అప్పుడే యింట్లోకి అడుగుపెట్టకపోయినట్లయితే ఆ సంభాషణ అంతటితో ఆగిపోయేది. ఓ విషయాన్ని గురించి వాదించి, సమర్థింపజూసే తత్వంకాదు శంకరంది. నారాయణరావంటే ఎందుకో విముఖత రేణుకకు. కొంత మందికి, కొంత మంది వ్యక్తులంటేపడదు. దానికి కారణం వుండనవసరంలేదు. అయినా ఏదో కారణం వున్నదనుకునేది రేణుక.

''ఈ వారపత్రికలో వచ్చినకథ గురించే కదూ?'' అనడిగింది రేణుక సౌమ్యంగా.

''అవును మీరు చదివారా? ఎట్లా వున్నది''. అన్నాడు నారాయణరావు.

''చాలా బావున్నది. మాబావకు కంగ్రాట్సు చెబ్దామనే వచ్చాను.''

''ఏం బావుంది. దాంట్లో మీకు నచ్చిన విషయమేమిటో చెప్పండసలు'' అన్నాడు నారాయణ రావు క్రిందకాలు కుర్చీమీద పెట్టుకుంటూ, కొంచెం అవహేళన ధ్వనించే స్వరంతో. ఆమెని చూడంగానే ఏదో పిశాచం ఆవేశించినట్లు, తన ఆధిక్యత చూపించుకోవాలని అన్నాడు.

రేణుక చాలా సెన్సిటివ్. నారాయణరావు అంతర్గతభావం గుర్తించగానే ఆమెకి మండిపోయింది.

''అసలు మీకేం నచ్చలేదో చెప్పండి.'' అన్నది కందికట్టెల తంపటవేస్తూ.

''యీ కథ సరిగ్గా, విమర్శనాత్మకంగా చదివితే ఎవరికయినా అర్థమవుతుంది. స్త్రీపాత్రనంత పేలవంగానా సృష్టించేది? ప్రేమాయణం లేకపోతే కథేమిటండీ. సర్వచర్యలకు సెక్స్ మూలకారణమన్నాడు కదా ఫ్రాయిడ్. అలాంటప్పుడు 'ప్రేమ' అనే మహత్తర విషయాన్ని మర్చిపోయి చేసిన రచన రసహీనమయిన వార్తాపత్రికకంటే ఏం గొప్పగా వుంటుంది?''

''మీరనేది ప్రపంచంలో శృంగారంతప్ప ఏమీ లేదని. శృంగారమనేది నవరసాల్లో ఒకటి మాత్రమే. దానితోనే జీవితం పూర్తికాలేదు. మనిషి జీవితంలో ఎన్నో రకాలయిన బాధలకు గురవుతాడు. ఎన్నో అనుభూతులను చవిచూస్తాడు. వాటి మాటేమిటి?'' అన్నది రేణుక.

స్త్రీ చర్చించలేని సెక్స్‌ను గురించి వాదించి ఆమెను అవమానించాలన్న రాక్షసకాంక్ష- విజ్ఞాన చర్చలో సిగ్గెగ్గుల గురించి ఆలోచించే తీరికలేని నేటి యువతీలోకపు నిర్భయత్వం- తలపడ్డాయి.

''యిన్ని రసాలు లేవసలు - వున్నది ఒక్కటే - సెక్స్. తెల్లటి వెలుగు కిరణం గాజు ఫలకంలోనుండి ప్రసరించినపుడు ఎలా ఏడు రంగులు ప్రతిఫలిస్తాయో, అలాగే జీవితంలోని యిన్ని రంగులకూ మూలభూతమైనది తెలుపే...'' నారాయణరావు.

''మీ అభిప్రాయం సరికాదు. అసలక్కడ తెలుపు అనే రంగేలేదు. తెలుపు అనేది జీవితానికి సరిపోల్చుకున్నట్లయితే - ఆ ఏడురంగుల కలయికే జీవితమయింది. ఏ ఒక్క వర్ణం - రసం లోపించినా అది జీవితంకాదు. లేక మీ అభిప్రాయమే సరి అనుకున్నా... విశ్లథమయ్యే ఏడు

రంగులకూ ఏది మూలభూతమయినా, జీవితం దిద్దటంలో అన్ని రంగులూ సమభాగస్వాములేకదా! ఒకటి సత్యం యింకోటి అసత్యం అవుతుందా?'' విషయాన్ని రంగుల్లో ముంచెత్తి, అతని కర్థంకాకుండా చేసింది రేణుక.

''పోనీ మీ అభిప్రాయమే సరియైంది అనుకుందామనుకున్నా అన్నిరసాలకన్నా శృంగారమే రమ్యమైందన్నారు కదండీ మీ అలంకారికులు.'' అన్నాడు నారాయణరావు. క్రిందపడ్డా మీద చెయ్యనేతత్వం.

''అవును, కాని అదే సర్వస్వమనలేదుగా.''

''ఏమిటోయ్ నీకిదంతా తలనొప్పిగా వున్నదా'' అన్నాడు నారాయణరావు శంకరంకేసి తిరిగి. 'మేం మాట్లాడే యింతింత గొప్ప విషయాలు నీకేమర్థమవుతాయిలే' అన్న ధ్వని.

''లేదు. ఒక్కటే ఆలోచిస్తున్నాను. నువ్వెప్పుడూ ఒక్కటే పట్టుకుకూర్చుంటావేం. యిది వరకు అనేవాడివి సర్వమైన చెడుగులకూ మూలకారణం ఆర్థిక అసమానత్వం. అది నిర్మూలనమైతే వర్గరహిత ఆదర్శ సమాజం ఏర్పడుతుంది అని. యివాళ జీవితాన్నంతా సెక్స్‌లోనుంచి చూస్తున్నావు ఏమిటా? అని... ఎన్నో విషయాలను నేర్చుకుంటున్నాం... జీవితంలో ఎన్నో అనుభూతులు అనుభవంలోకి వస్తున్నాయి. అవి జీర్ణమయి ఓ రాజమార్గాన, ఓ సింథసిస్‌లోకి రావటానికి కొంతకాలం పడ్తుంది'' అన్నాడు శంకరం. హిమాలయం మీది మంచు ఎప్పుడూ తరగదు. సంవత్సరంలో ఏ మూడు నెల్లోవుంటుంది వేసవి. అప్పుడు మంచుకరిగి ప్రవహించే నీరే జీవనదుల్ని వట్టిపోకుండా చేస్తుంది. ఎక్కువగా మాట్లాడని శంకరం మాట్లాడినప్పుడు మానవ స్వభావాన్ని కాచి వడపోసినట్లే వుండేది.

''ఏదో వేదాంతం చెప్తున్నావుకాని శంకరం, అవి రెండూ రెండు సిద్ధాంతాలు. ఒకటి సబ్జక్టివ్, వేరొకటి ఆబ్జక్టివ్. దేనికదే సత్యం. ఎంతసేపు మాట్లాడినా పొట్టకూటికొచ్చేది కనకనా? బజారు కెళ్దాం వస్తావా పుస్తకాలు కొన్దామంటివికదా?''

'కాస్టింగ్' చదవటం నారాయణరావు ముందు మొదలెట్టాడు. అందువల్ల చాలా పుస్తకాలు అతనే కొన్నాడు. శంకరం కంటే నారాయణరావు దగ్గర డబ్బుబాగానే మెదులుతూ వుండేది. కాని శంకరం అతనితో కలిసి చదవటం మొదలు పెట్టిన తర్వాత అతని దగ్గర లేనివీ, మంచి ఎడిషన్స్ అనిపించినవీ తను కొనాలనుకున్నాడు. ఇంకా అతనిచేత కొనిపించటం భావ్యమనిపించలేదు శంకరానికి. ఫెస్టివల్ అడ్వాన్సుకు అప్లయిచేస్తే మొన్నేవచ్చింది. నానా అవస్థలూపడి కొన్ని పుస్తకాలు కొన్నా, యింకా కొన్ని కొనాల్సినవి వుండిపోయాయి.

ఇద్దరూ బయలుదేరారు. రేణుక అత్తతో మాట్లాడాలని లోపలికి వెళ్ళిపోయింది. పుస్తకాలు ఎవరుకొన్నా నారాయణరావుదే సెలక్షన్ - కారణం అందరూ తనను సర్వజ్ఞుడుగా గుర్తించాలనే దొరవ.

సెకండ్ హాండు పుస్తకాల షాపులో బాల్లిబాయ్ కన్పించింది. సగం ధరకు యిస్తానన్నాడు. అప్పటిదాకా ప్రక్కింటి బి.కాం. విద్యార్థి దగ్గర తీసుకుని గడిపేస్తున్నాడు. చవకలో వస్తుందికదా తీసుకుందామనుకున్నాడు శంకరం. అంతలోనే నారాయణరావు జేబులోంచి పదిరూపాయల నోటిచ్చి తను తీసుకున్నాడు. అప్పటివరకూ ఏపుస్తకాలూకొనే ఉద్దేశంలేని నారాయణరావు ప్రవర్తనకు శంకరం ఆశ్చర్యపోయాడు.

అయినా ఏం మాట్లాడలేదు. 'పోన్లే ఎవరిదగ్గర వుంటేనేం. ఇద్దరం కలిసి చదువుకునేదేకదా!' అని సరిపుచ్చుకున్నాడు, 'ప్రతిమనిషిలోనూ ఏవో లోపాలుంటాయి. సరిపెట్టుకోవాలి. లేనినాడు స్నేహబంధమేముంది, దౌర్బల్యాలులేని మనిషెవరుంటాడు? దౌర్బల్యాల నధిగమించి దైవత్వం వైపు పయనించటమే మానవత్వం'' అనే తత్వం శంకరానిది-

బాబాయికి ఒంట్లో బాగుండలేదని ఉత్తరమొస్తే, జరూరుగా అమలాపురం వెళ్లాడు శంకరం. పరీక్షలకనిపెట్టిన సెలవంతా వృధాఅయిపోతుందని ఓ చెంప బాధ. వారం రోజుల కంటే అక్కడ ఉండలేకపోయాడు. తిరిగివచ్చిన తరువాత తెల్సింది. జనవరి 12న మొదలవాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 20కి పొడిగించారని.

నారాయణరావుకు తను అమలాపురం వెళ్ళటం సక్రమకారణంలా కన్పించదు. అందువల్ల ఈ వారంరోజులు అధ్యయనానికి హాజరు కాకపోవటానికి సరియైన కారణం ఏం చెప్పాలా అనుకుంటూ నారాయణరావు యింటికి వెళ్ళాడు శంకరం.

రామానుజం, వేంకటశేషయ్య ఆరోజు సెలవుకాబోలు పడుకున్నారు. నారాయణరావు భోజనానికికెళ్లాడేమో ననుకున్నాడు శంకరం.

''ఏం సార్! వారంరోజులుగా కన్పించడం లేదేం'' అడిగాడు రామానుజం.

చెప్పాడు శంకరం.

''నారాయణరావు వాళ్ళ మామగారి వూరికెళ్ళాడు. అదుగో ఆ టేబిల్‌మీద ఉత్తరం వ్రాసిపెట్టి వెళ్ళాడు. మీ పరీక్షలతేదీ పొడిగించారటకదా! మొన్న వాళ్ళావిడ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. యిక్కడుండటం ఖర్చనుకున్నాడో ఏమో వెళ్ళిపోయాడు.''

టేబిల్‌మీది ఉత్తరం తీసి చదివాడు శంకరం.

''డియర్ శంకరం,

మా మామగారి ఊరు వెళ్తున్నాను. నీ కోసం మెథడ్స్ సైకిల్‌స్టైల్డ్ నోట్సు అట్టిపెట్టి వెళ్తున్నాను. బాగా చదవవలసింది. క్రింద అడ్రసు ఇస్తున్నా, ఉత్తరం వ్రాయవలసింది.

శుభాకాంక్షలతో-

నారాయణరావు.''

అతనలా అకస్మాత్తుగా వెళ్ళిపోవడం ఆశ్చర్యమనిపించింది శంకరానికి. అంతకుముందు 'ఫామిలీవుంటె చదువుసాగదు. పరీక్షలయ్యేదాక ఎక్కడికీ పోనన్నవాడు ఎలా వెళ్ళాడా?' అనుకున్నాడు శంకరం. అతను వెళ్ళిన తరువాత, తనక్కడవుండి చదువుకోవటానికి మనస్కరించలేదు శంకరానికి. యిద్దరూ కలిసి చదవటంవల్ల, శంకరం పుస్తకాలు కూడా నారాయణరావు యింట్లోనే వుండేవి. తన పుస్తకాలు సర్దుకుంటున్నాడు శంకరం.

''అతను చాలా యిదయ్యాడండి. మీకు అన్ని పుస్తకాలు లేవటకదా! 'ఏం చేస్తాను నాకవసరమొచ్చింది. అతనికి యిబ్బంది కల్గించక తప్పటంలేదు' అన్నాడు వెళ్ళేటప్పుడు'' అన్నాడు. వేంకట శేషయ్య కప్పుకున్న దుప్పటిని తొలగిస్తూ.

''ఏం ఫరవాలేదండీ! ఎవరి అవసరాలువాళ్ళవి. దాన్నిగురించి చింతించి ఏం ప్రయోజనం.'' పుస్తకాలు సర్దుతూంటే అతనిదగ్గర లేకపోతే, తను కొన్నపుస్తకాలు ఓ ఐదు కన్పించలేదు. అలమరంతావెదికి చూశాడు. అతను పట్టుకుపోయినట్లున్నాడు.

''పరీక్షల సమయంలో పుస్తకాలకోసం యింకోళ్ళ మీద ఆధారపడటం మంచిది కాదండీ!'' సుభాషితాల రామానుజం సలహా.

''భలేవారేనండీ! నాకున్న పుస్తకాలే అసలు తక్కువ. అందుట్లో సగం తను పట్టుకుపోయాడు. పైగా నేను అన్నిపుస్తకాలూ కొనలేదన్న మొసలికన్నీళ్ళెందుకండీ? ఏదో మెహర్బానీ చూపించినట్లు ఎందుకూ పనికిరాని యీ సైకిలోస్టైల్డ్ నోట్స్ నామొహాన కొట్టాడు.'' అన్నాడు శంకరం. పుస్తకాలు కొనటానికి డబ్బు దొరకక నానాబాధలుపడి కొన్న నాలుగుపుస్తకాలూ అతను పట్టుకుపొయ్యేటప్పటికి శంకరానికీ బాధ అన్పించింది.

''నారాయణరావు అంతేనండీ? అతనికి 'నేను' అన్నమాట ముందు ఇంకేం కన్పించవు. 'నా' తరవాతే మిగతావి.'' అన్నాడు వేంకటశేషయ్య.

ఇంకేమీ విచారించీ ప్రయోజనంలేదు. మిగిలిన పుస్తకాలు సర్దేసి బయలుదేరాడు శంకరం. 'యిప్పుడు యింక పరీక్షలకు చదవదల్చుకుంటే తన దగ్గరలేని పుస్తకాలు కొనాలి, అతను తీసుకెళ్ళినవీ కొనాలి. వంద రూపాయలపైనే అవుతుంది' ఏం చేయాలో తోచలేదు శంకరానికి. మామయ్యనయినా సహాయం అడగాలి అనుకున్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ కృష్ణలంకలోనున్న రేణుక వాళ్ళ యింటికి వెళ్లేటప్పటికి రెండుగంటలయింది. పైన ఎండమాడుతోంది. లోపల మనస్సు ఉడుకుతోంది.

మామయ్యలేడు. రేణుక ఏదో పత్రిక తిరగవేస్తోంది. అత్తయ్య వంటింట్లో రామాయణ పారాయణ చేస్తోంది.

''బహుకాల దర్శనం'' అన్నది రేణుక శంకరాన్ని చూసి,

చెప్పాడు శంకరం. ''మామయ్య ఎక్కడకు వెళ్ళాడు. కొంచెం డబ్బుకావాలి.''

''ఎందుకో...''

''కొన్ని పుస్తకాలు కొనాలి.''

''పరీక్షలు దగ్గరికొస్తూంటే యింకా పుస్తకాలేమిటి? అన్నీ యిదివరకే కొన్నావుగా?''

వివరించాడు శంకరం.

''నేన్చెప్పలేదూ నువ్వందర్నీ నమ్ముతావు బావా. వెనకటికి ఎవరో అన్నాడటలే. 'అరే, నువ్వు బఠానీలు తీసుకురా, నేను మరమరాలు తెస్తాను. యిద్దరం కలిసి తిందాం' అని, బఠానీలు ఖరీదు మరమరాలు చౌక. పంచుకోవటం మాత్రం చెరిసగం. అలావుంది మీ సామ్యవాద మిత్రుడి స్నేహం'' అని ''చెప్పటం మరిచా అతను మొన్న అలంకార్‌లో కన్పించాడు. అంతకుముందు ఓసారి లైబ్రరీలో, ఓసారి మార్కెట్టులో కన్పించాడు. నీ స్నేహితుడు గదా అని గౌరవించాను. మొన్న నేను, సరళ సినిమాకు వెళ్దామని అంటే అలంకార్ టాకీసుకు వెళ్లాను. సరళ ఎంతసేపటికీ రాలేదు. అది యిక రాదేమో పోన్లే వచ్చిందాన్ని తిరిగి వెళ్ళటమెందుకని హాల్లో వెళ్ళి కూర్చున్నాను. పాత సినిమా అవటంవల్ల రష్‌లేదు. మీ నారాయణరావుకూడా వచ్చాడు. నేను కన్పించగానే వచ్చి నా ప్రక్క సీటులో కూర్చున్నాడు. తనూ, తన చదువూ, భావి జీవితపు తన కలలూ ఏవేవో మాట్లాడాడు-

''ఏమండీ రేణుకాదేవిగారూ! మరోలా భావించకండి. ప్రేమ వివాహాలమీద మీ అభిప్రాయమేమిటి?'' అన్నాడు అకస్మాత్తుగా.

''ఏమిటో కథ'' అన్నాను.

''నేను ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను'' అన్నాడు.

''మంచిదే... శుభస్య శీఘ్రం'' అన్నాను.

''వధువు ఎవరో, ఏమిటో అడగరేం''

''చెప్పండి.''

''ఇంకా నిర్ణయించలేదు. ఓ అమ్మాయి నా దృష్టిలోవుంది. అచ్చం మీలానే ఉంటుంది. మీ కాలేజీలోనే చదువుతోంది. నా స్నేహితుడికి దూరపుచుట్టం... అడుగుదామను కుంటున్నాను'' అన్నాడు.

నాకర్థమయింది.

''వాళ్ళబావ తంతాడేమో చూసుకున్నారుకదా!'' అన్నాను.

అంతలో సినిమా మొదలయింది. యింటర్వెల్‌దాక ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు.

యింటర్వెల్ కాంగానే నాకు కనీసం చెప్పకుండా వెళ్ళిపోయాడు. యిప్పుడు ఊర్నించే మకాం ఎత్తాడన్నమాట. బాగానే ఉంది'' అన్నది రేణుక.

''అదేం రేణూ! అతనికి పెళ్ళయిందికదా... అతని భార్యదికూడ మా ఊరే.... ఆవిడవల్లే యితని పరిచయమైంది నాకు'' అన్నాడు శంకరం ఆశ్చర్యంగా.

''పెళ్ళయిందా! రాస్కెల్.... తెలిస్తే అప్పుడే చెంప పగలగొొట్టను. పెళ్ళయినవాడికి యివేం బుద్ధులో...''

ఆ తరువాత జానకిరామయ్యగారు రావటంతో సంభాషణ ఆగిపోయింది. యిదంతా జరిగిన తరువాత శంకరానికి 'కాస్టింగ్' చదువబుద్ధిపుట్టలేదు. ఆయన్ని డబ్బు అడక్కుండానే వచ్చేశాడు. ఆ తరువాత నెలరోజుల్లోనే గవర్నమెంటు ఉద్యోగం రావటం, శంకరం సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగానికి రాజీనామాయిచ్చి పట్నానికి చేరటం - ఆ తరువాత మళ్ళీ యిప్పుడే నారాయణరావుని చూడటం తటస్థించింది.

నారాయణరావు వాళ్ళ సామాన్లు ప్రకాష్‌నగర్‌లో జేరవేసి, కొంపకు చేరేటప్పటికి ఎనిమిదిన్నర, తొమ్మిదిగంటలయింది. పిల్లలు పడుకున్నారు. రేణుక అన్నం వడ్డిస్తూంటే చెప్పాడు శంకరం.

''నారాయణరావు కన్పించాడోయ్.''

''ఏ నారాయణరావు.''

''అదే... బెజవాడలో మేమిద్దరం 'కాస్టింగ్' చదివేవాళ్ళం.''

''ఓ మీ బఠానీ మిత్రుడా!.... ఎట్లా వున్నాడు... యిక్కడ ఉద్యోగమా.'' ఆ తరువాత నారాయణరావుని 'బఠానీ మిత్రుడని' వ్యవహరించేది రేణుక.

''అవును ఏదో ఆఫీసరుద్యోగమే. శమంతకమణీ, నారాయణరావూ యిద్దరూ మార్కెట్టుదగ్గర కన్పించారు. వాళ్ళేదో పార్టీకి వెళ్లాలట. వస్తానన్న ఆఫీసు వ్యాను రాలేదు. వాళ్ళ సామాన్లేవో యింట్లో పడేసి వెళ్ళమంటే ప్రకాశం నగర్‌లో దిగి, మళ్ళీ బస్సెక్కి వచ్చా - అందుకే ఆలస్యమయింది.''

''మొదలయిందీ... మీ కప్పుడే చెప్పాను.... యీ 'నియో సోషలిస్టు'కి దూరంగా వుండమని... అట్లాంటి వ్యక్తులతో పరిచయం పెంచుకుంటే ఎక్కువ నష్టపోయేది మనమే'' అన్నది రేణుక.

''సరేలే ఎప్పుడో పదేళ్ళమాట. యింకా మనిషి మారకుండా వుంటాడా ఏమిటి?''

''అట్లాగే అంటూాండండి, నెత్తిన మొట్టిందాకా మీకు తెల్సిరాదు.''

ఆ తరువాత కథ తొందరగా నడిచింది. నారాయణరావుని కలిసిన మూడోరోజు శంకరం ఆఫీసర్ రామచంద్ర పిలిచి చెప్పాడు - తనకు నారాయణరావు బాగా తెల్సనీ, ఏమయినా సహాయం కావాల్సుంటే తన్నొచ్చి కల్సుకోమనీ, తను తప్పకుండా సహాయం చేస్తాననీ చెప్పాడు.

రెండురోజులు కాజువల్ లీవుపెట్టి అవాళే ఆఫీసుకు వెళ్ళాడు శంకరం. ఫైలు తీసుకువెళ్ళిన శంకరాన్ని కూర్చోమన్నాడు రామచంద్ర.

''ఓ సహాయం చేసి పెట్టాలోయ్ శంకరం'' అన్నాడు.

''ఏమిటిసార్...''

''ఏం లేదు. మా కుర్రాడికి కాస్త ట్యూషన్ చెప్పాలోయ్. యైత్‌క్లాసు చదువుతున్నాడు. మిగతా యింగ్లీషు, అవీ ఫర్వాలేదు. తెలుగు, లెక్కలు వెరీపూర్... మొన్న నారాయణరావుతో మాటల సందర్భంలో అంటే నీపేరు సజెస్టు చేశాడు. వాళ్ళబ్బాయినికూడా పంపిస్తానన్నాడు. యిద్దరం ఉండేది ప్రకాశం నగరే కాబట్టి నీకూ యిబ్బంది ఉండదు. నీ యిష్టం ఫీజు ఎంతకావాలో చెప్పు?'' అన్నాడు.

శంకరానికి ఆర్థికంగా ఏ ఇబ్బందీలేదు. అతనికి తన కథలమీదా, వ్యాసాలమీదా వచ్చే డబ్బుతోనే పుష్కలంగా గడిచిపోతోంది. ఏం చెప్పాలో తోచలేదు శంకరానికి.

''చూడు మిస్టర్ శంకరం, కొంచెం కష్టమయినా నువ్విది నాకోసం చేసిపెట్టాలి. సాయంత్రం ఐదుగంటలకు నాతోపాటు కార్లోవద్దుగాని ఓ గంటలో మళ్ళీ యింటికి వెళ్ళిపోవచ్చు. ఏమంటావు'' అన్నాడు.

యిది తన రచనా వ్యాసంగానికి అడ్డంకే అయినా ''సరే''నన్నాడు శంకరం ఆఫీసరుగారి మాట త్రోసిపుచ్చటం భావ్యంకాదని.

ట్యూషను సంగతి చెప్పినప్పుడు యిష్టంలేక పోయినా మెదలకుండా ఊరుకున్నది రేణుక. రోజూ కార్లో తీసుకెళ్తానన్న ఆఫీసరుగారు, అసలు ఐదుగంటలదాకా, ఆఫీసులో ఉంటేగా - శంకరాన్ని తీసుకెళ్ళటానికి. మొదట్లో ఐదుగంటలదాకా వుండినపుడు, శంకరాన్ని తీసికెళ్ళిన ఆఫీసరుగారు, ఆపైన అసలు ఆ విషయాన్ని మర్చిపోయాడు. ఐదుగంటలకు ఆఫీసునుండి బయలుదేరిన శంకరం ప్రకాశం నగర్ చేరేటప్పటికి ఆరు ఆరున్నరయేది. అక్కడో గంటో, రెండుగంటలో ట్యూషన్ చెప్పి, మళ్ళీ బస్సుకోసం నిరీక్షించి కొంపకు చేరేటప్పటికి ఎనిమిదిన్నర, తొమ్మిది గంటలయ్యేది. యింక తిండితిని పడుకునేటప్పటికి పదిగంటలు - ఏమన్నా వ్రాసుకుందామన్నా, ప్రొద్దుటనుండి అలసివున్న శరీరం బద్ధకించేది. ప్రొద్దున్నే లేచి పదిగంటల లోపల, సాయంత్రం వీలుకాదుకనుక, బజారుపనులు చూసుకునేవాడు.

యీ ట్యూషన్ ఉద్యోగం లేకముందు తన పిల్లల చదువుసంధ్యల గురించి శ్రద్ధ వహిస్తూండేవాడు శంకరం. యిప్పుడసలా తీరికే వుండటంలేదు. పోనీ రేణుకను ''కాస్తవాళ్ళ సంగతి చూడ''మంటే ఎగిరిపడేది.

''ఆఁ మీరేమో ఊరివాళ్ళను ఉద్ధరించండి. నేను యీ వెధవలకు చెప్తాను'' అనేది. పోనీ ఆర్థికంగా ఏమన్నా లాభదాయకంగా వున్నదా అంటే అదీ ఏం కనిపించలేదు. మొదటి రెండు

మూడు నెలలు శంకరం తీసుకోవటానికి తటపటాయించాడు. ఆతరువాత యివ్వటం మరిచి పోయాడు ఆఫీసరుగారు. నారాయణరావు తన కొడుకు చదువుక్రింద శంకరానికి ఏమయినా యిద్దామని అనుకోలేదు. శంకరం అడగలేదు. పైగా రోజూ బస్సు ఛార్జీలు అదనపు ఖర్చు.

శమంతకమణి ఆఫీసరుగారి భార్య అయిన తరువాత చాలా మారిపోయింది.

''శంకరం .... యివాళ ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టాలోయ్''

''శంకరం... రేపు యీ వాటర్‌బిల్ మర్చిపోకుండా కట్టేం. రేపు దాటితే మునిసిపాలిటీ వాళ్ళిచ్చే పదిపైసల రిమిషన్ కూడా కట్టాల్సి వస్తుంది.'' ఆవిడ పదిపైసల రిమిషన్‌కోసం శంకరం ముప్పయి పైసలు సిటీబస్సు ఛార్జీ పెట్టుకువచ్చి, సికిందరాబాదు మునిసిపల్ ఆఫీసులో వాటర్‌బిల్ కట్టి, మళ్ళీ ముప్పయి పైసల సిటీ బస్సు ఛార్జీతో ఆఫీసుకు పోవాలి.

''శంకరం... నువ్వు సాయంత్రం వచ్చేటప్పుడు సికిందరాబాద్ స్టేషన్‌లో దిగే వస్తావుగా. నాయన్నాయనా! కాస్త మోండాదాకా నాల్గడుగులువేసి ఏంవన్నా కూరలు తెచ్చిపెట్టు. ఆయనకి చెప్పటంవేకాని చచ్చువీ, పుచ్చువీ తగలెట్టుకొస్తారు.''

ఇలావుంది శంకరం జీతం బత్తెం లేని కొలువు. సామాన్యంగా ఎదుటివాళ్ళ మనసు నొప్పించటం యిష్టంవుండదు శంకరానికి. పైగా శమంతకమణి చిన్నప్పటినుండి ఎరిగిన పిల్ల. ఏదో ఆత్మీయతా, చిన్ననాటి చెలిమి, సోదరభావం, ఆమె మాటలకు ఎదురు చెప్పనిచ్చేదికాదు.

ఓ ఆదివారం నారాయణరావూ, శమంతకమణీ శంకరం ఇంటికి వచ్చి వెళ్ళారు.

ఆ రోజు వాళ్ళ నాన్న వస్తున్నాడని వుత్తరం వచ్చింది. ఉల్లాసంగా వున్నది రేణుక. ప్రొద్దున పూట పేపరు చూస్తున్నాడు శంకరం పడక కుర్చీలో కూర్చుని, బియ్యపుచేట తెచ్చుకుని, దగ్గరగా కూర్చుంటూ అన్నది రేణుక.

''బస్సులో ఎలాగా నాన్న వచ్చేటప్పటికి మూడుగంటలవుతుంది. మీరూ సెలవుపెట్టి ఇవాళ యింట్లో వుండగూడదటండీ...'' అని కళ్ళతో నవ్వుతూ, హేలగా, ప్రేమగా అనే మాటలకు కాదనలేకపోయాడు శంకరం.

''ఎలాగా యింట్లోవుంటున్నారుగా... మీకిష్టమైన స్వీట్ చేస్తాను చెప్పండి... గులాబ్ జామా... మైసూరుపాకా...'' అంటోంది రేణుక.

''ఎంత దయో శ్రీకాంతుడిపై, ఏంకథ? మీనాన్న వస్తున్నాడనేనా యీసంతోషమంతా... రోజూ ఎవరైనా మీ పుట్టింటివాళ్లు వచ్చి పలకరించిపోతూంటే బావుండును.''

''పోదురూ... లేకపోతే అక్కడికి మిమ్మల్ని మహా మాడ్చినట్టు'' అని రాళ్ళేరుతున్న బియ్యపు చేటలోనుండి, ఓ మట్టిగడ్డ శంకరంమీద విసిరి వేస్తూ, గేటు చప్పుడయినట్లుండి లేచి తలుపు

దగ్గరకు వెళ్ళింది.

''అయినట్లే యిక.... మీ శమంతకమణి వస్తోంది. యివాళ లేవగానే ఎవరిమొహం చూశానో కాని... నా పనంతాబుగ్గే...'' అని విసుక్కుంటూ లేచి, వస్తున్న శమంతకమణిని ఆహ్వానించింది మొహాన నవ్వుపులుముకుంటూ.

''అరె... శంకరం... నువ్వింకా యింట్లోనే వున్నావా.... ఆఫీసుకెళ్ళలేదూ...''

''లేదు శమంతకం, ఇవ్వాళ సెలవుపెట్టాను.''

''అయితే మరీమంచిది. అట్లా బజారుకెళ్దాము వస్తావా? రేణుకగారూ మీరుకూడా రండి. అసలు మిమ్మల్ని తోడుతీసికెళ్దామనే వచ్చాను''అంది శమంతకమణి.

''పొద్దున్నే ఎలాగ... నాకెక్కడిపని అక్కడే వుంది... మీరెళ్ళండి.'' బియ్యపుచేట యింట్లో పెడుతూ అన్నది రేణుక. అన్‌వాంటెడ్ గెస్ట్ శమంతకమణి రేణుకకు.

''పోనీ నువ్వుపద శంకరం! తొందరగా వచ్చేద్దాం. చీరెలుకూడా కొనాలి. మా ఆడబిడ్డ వస్తోంది. చీరెల సెలక్షను నువ్వుబాగా చేస్తావు. మొన్న ఆయనా, నువ్వూవెళ్ళి తెచ్చారు చూశావూ ఆ ఈజిప్షియన్ కాటన్‌చీరె - ఎంతో బావుంది. మాక్లబ్బులో అంతా మెచ్చుకున్నవాళ్ళే... అది నీసెలక్షనేటగా... ఆయనే కనకతెస్తే చూశావూ - పొయ్యిలో పెడితే లేచొచ్చేటట్టుంటాయి ఆ కలర్సూ అవీ...''

''అబ్బ నువ్వెళ్ళిరారాదూ! బద్ధకంగా వుంది'' అన్నాడు శంకరం. ఒక్కసారిగా కాదనలేని మొహమాటం మొహంపెట్టి. రేణుక మొహం మాడిపోతోంది.

''సరేలే ఎవ్వరూ లేకపోతే నేనెలా వెళ్ళేది. నీబద్ధకమూ, నువ్వూనూ ఎప్పుడూ వుండేదేగా.'' లేచి గుడ్డలేసుకుని బయలుదేరిందాకా వదలలేదు శమంతకమణి. యిద్దరూ బయటకు వెళ్తూంటే తలుపులు విసురుగా మూస్తూ కోపగించుకుంటోంది రేణుక. అలా వెళ్ళిన శంకరం యింటికి తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం ఐదుగంటలయింది.

ఇంటికి వెళ్ళేటప్పటికి రేణుక అగ్గిమీద గుగ్గిలంలా వుంటుందని భయపడుతూనే వచ్చాడు శంకరం.

ముందు వరండాలో జానకిరామయ్యగారు కూర్చుని వున్నాడు. కొద్దిదూరంలో తలుపుకానుకొని కూర్చుని కబుర్లు చెప్తోంది కూతురు.

''ఏరా! ఆఫీసునుంచేనా రావటం'' శంకరం రావటంచూసి అడిగాడు మామగారు.

''అవునుపాపం... ఆఫీసునుంచే.. తీరికలేని వుద్యోగం...'' అని వెక్కిరింతగా అంటోంది రేణుక. వాళ్ళనాన్న వచ్చిన సంతోషంతో శంకరంమీది ఆగ్రహం కొంత శాంతించినట్లుంది.

''ఏయ్ రేణూ!...'' దొడ్లో కాళ్ళుకడుక్కుంటూ పిల్చాడు శంకరం.

రేణుక వచ్చింది.

''శుభవార్త... మా ఆఫీసరుగారికి బదిలీ అయింది. యింకోవారం, పదిరోజులలో వెళ్ళిపోతాడు.''

''ఏం సంబడం... యింకో గ్రహం వుండనే వుందిగా...''

''ఈ గ్రహం పోతే. ఆ గ్రహాన్నికూడా వదిలేస్తాననుకో...''

''సరేలెండి అయినప్పటిమాట.''

రేణుక ఊహే కర్రెక్ట్. అది అయినప్పటిమాటే అయింది. ఆఫీసర్ రామచంద్రగారికి బదిలీ అయింది. వాళ్ళు ఊరొదిలి పెట్టివెళ్ళినా, శంకరం ట్యూషను పనిమాత్రం ముగింపుకాలేదు. వారం పదిరోజులు చూసి అడిగింది రేణుక. ''ట్యూషను చెప్పటం వదిలేస్తానంటిరిగా... ఎంతవరకొచ్చిందో...''

''రామచంద్ర కొడుకుని తీసుకుపోయాడనుకో ... నారాయణరావు కొడుకు ఇప్పుడిప్పుడే పికప్ చేస్తున్నాడు. యిప్పుడెలాగా జనవరి నడుస్తోంది. యింకో రెండు నెలలుంటే పరీక్షలయిపోతాయి. మధ్యలో యెట్లా వదిలిపెడ్తాము. ఏమంటావు'' అన్నాడు సానునయంగా శంకరం. చదువు మధ్యలో విడిచిపెడితే, నట్టేట్లో ముంచినట్లవుతుందని అతని వుద్దేశం.

''ఆహాఁ... వాళ్ళయ్యకి అప్పుడా తెలివితేటలు లేకపోయినయ్యేం... అప్పుడు మీ పుస్తకాలు కూడా తీసుకుని ఉడాయించాడుగా...''

''పోన్లే ఎవరిపాపం వాళ్ళది... వాళ్ళేదో చేశారని...''

''మీ రాట్టే మాట్లాడకండి.. నాకొ్కోపం వస్తుంది.'' అంది రేణుక మొగుడిమాట తుంచేస్తూ.

శంకరం అట్టేమాట్లాడే మనిషికాదు. అలానే ట్యూషను చెబుతున్నాడు.

ఆ సంవత్సరం, శంకరం వ్రాసిన నవలకు సాహిత్య అకాడమీ వాళ్ళ ప్రైజు వచ్చింది. ఆ సందర్భంగా యువతీమండలి వాళ్ళు అతనికో సన్మానసభ ఏర్పాటు చేశారు.

ఆరోజే అతని సన్మానం.

మధ్యాహ్నం నారాయణరావు ఆఫీసుకు ఫోను చేశాడు.

''రేపొద్దున కర్నూలు వెళ్ళాలి శంకరం. అవసరమయిన పనివుంది. రిజర్వేషనులో నీ ఫ్రెండెవరో వున్నాడంటివిగా, ద్రోణాచలం బండిలో ఓ సీటు రిజర్వు చేయించు...టిక్కెట్టు సాయంత్రం యింటికొచ్చేటప్పుడు పట్టుకొస్తావుగా...''

సాయంత్రం సికిందరాబాదు స్టేషన్‌కి వెళ్ళి, సీటు రిజర్వుచేయించి యింటికొచ్చేటప్పటికి

మహిళామండలి వాళ్ళకారు వచ్చింది. రేణుకతో సహా బయల్దేరాడు శంకరం. యిద్దరు ముగ్గురు ప్రముఖ రచయితలు శంకరం నవలలోని గొప్పదనాన్ని గూర్చి ప్రశంసించారు.

ఆరోజు సన్మానసభకు వచ్చిన శమంతకమణి శంకరాన్ని స్టేజిమీద చూసి చాలా ఆశ్చర్యపోయింది. అప్పటివరకూ ''నీలిదీపం'' నవల 'రేణూ'గారు వ్రాశారంటే ఎవరోననుకుంది. శంకరం తన భార్యపేరులోని మొదటి రెండక్షరాలూ తన 'కలంపేరు'గా పెట్టుకుని వ్రాస్తున్నాడని ఆమెకు అప్పటివరకూ తెలియదు. తన చిన్నప్పటినేస్తం - శంకరం - యింత మెత్తటి శంకరం, యింత గొప్పవాడా అని ఆమె ఆశ్చర్యపోయింది.

కార్యక్రమం ముగిసింది. శమంతకమణి వెంటనే కారులో వెళ్ళిపోయింది. అంతమంది జనంలో వాళ్ళను కలుసుకొనటం పడలేదు. శంకరం, రేణూ యువతీ మండలివాళ్ళ కారులో ప్రకాశంనగర్‌లో దిగి కారును పంపించివేశారు. రిజర్వేషను టికెట్టు, నారాయణరావుకిచ్చి వెళ్దామన్నాడు శంకరం.

శమంతకమణి గుడ్డలు మార్చుకుని వచ్చింది. నారాయణరావు ఎవరికోసమో ఎదురు చూస్తున్నాడు.

''ఏమండీ! మన శంకరం ఎంత గొప్ప వాడయిపోయాడనుకున్నారూ...''చెప్తోంది శమంతకమణి.

''సరేలే! వాడి గొప్పదనానికేంగానీ... రేపు ద్రోణాచలం బండిలో సీటు రిజర్వు చేయించి ఐదుగంటలకు వచ్చేటప్పుడు పట్టుకు రమ్మన్నాను. రేపు కర్నూలు వెళ్ళాల్సిన పనిలేదు. ఆ టిక్కెట్టు మళ్ళీ వాపస్ చేస్తాడేమో ననుకుంటే యింత మటుకు అయిపులేడు.''

యింట్లోకి రాబోతున్న రేణుకా, శంకరాలు నారాయణరావు మాటలు విని ఆగిపోయారు.

''ఏఁవిటండీ! మీరు మరీను. అతనిచేత అంతంత చిన్నపనులా చేయించటం. మీ ఆఫీసు ప్యూనును పంపించకూడదటండీ రిజర్వేషనుకు...'' శంకరం పొందిన ఆనాటి సభాపూజ్యత చూసిన శమంతకమణిలో యిప్పటికి కొంత జ్ఞానోదయమైంది.

''ఏడిశావ్‌లే.... వాడి సంగతి చెప్పకు నాదగ్గర... యిట్లాంటి వెధవల్ని ఎలా వాడుకోవాలో నాకు తెల్సు.... అసలు ఎందుకు చేస్తున్నాడంటావు మనం చెప్పిన పనులన్నీ... మన పిల్లవాడికి కానీ ఫీజు తీసుకోకుండా ఎందుకు చదువు చెప్తున్నాడంటావు...? యీయనేమన్నా ఈశ్వరచంద్ర విద్యాసాగరా?... వాడికి నీమీద వ్యామోహం... నీ బోగంటక్కుల్నిచూసి మురిసి వాడెట్టా ఆడమంటే అట్టా ఆడుతున్నాడు. దగ్గరకు రాకుండా, లొట్టలేయించి, పనిచేయించుకోవటం నాకు బాగా తెల్సునే....''

యిది నారాయణరావు అసలురంగు. శంకరం సాధుత్వానికి, అతని నిర్వచనం విని భార్యాభర్తలిద్దరూ నిర్విణ్ణులైపోయారు.

''మీకు ఏళ్ళొస్తున్నకొద్దీ బుద్ధిలేకుండా పోతోంది మరీను... శంకరం అంటే ఇదన్నమాట మీకున్న అభిప్రాయం. అతని కాలిగోటికి కూడా సరిపోలరండీ మీరు.... యివాళ యువతీ మండలివాళ్ళు అతని నవలకు అకాడమీ ప్రయిజు వచ్చిన సందర్భంగా పురస్కరించారు. అతన్ని స్టేజిమీద చూస్తుంటే, మా చిన్నప్పటి శంకరం యింత గొప్పవాడయ్యాడా అన్పించింది. మీ ఉద్యోగాలెంతఁజేసును. మీ ఆఫీసరు హోదా లెంతఁజేసును... యివాళ్టి అతన్ని గౌరవించిన తీరుచూస్తే...'' అంటోంది శమంతకమణి.

శంకరం త్వరగా కోలుకున్నాడు. రేణుకను తట్టి నడిపించాడు. శంకరం, రేణుకలను చూడగానే నిర్వాక్కులై నిలబడి పోయారు భార్యాభర్తలిద్దరూ.

శంకరం మొహం ఎఱ్ఱబడిపోయింది. గుప్పెట్లో రిజర్వేషను టిక్కెట్లు నలిగిపోతున్నాయి. ఏదో మాట్లాడబోయాడుగాని మాటలు పెగల్లేదు.

ఆ రూపంలో ఎన్నడూ ఎరగని భర్తను చూసిన రేణుక, ఆ అసహ్య వాతావరణంలో యింకొక్క క్షణమయినా వుండటానికి భయపడింది. భర్తను చెయ్యిపట్టుకు లాగుతూ తీసుకువెళ్ళిపోయింది. విరిగిపోయిన రిజర్వేషను టిక్కెట్టు ముక్కలు తొక్కుకుంటూ వెళ్ళిపోయిన రేణుకా, శంకరాలను స్తబ్ధులై చూస్తూండిపోయారు భార్యాభర్తలిద్దరూ.

'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక

2-4-1971

(విరోధికృతు ఉగాది కథానికల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ)


*With best compliments from*

**K.S. Ganesh Rao**

H.No. 6-3-193/1
New Boiguda, Jainagar Colony
SECUNDERABAD
Phone : 753 2475